ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణ

ఎల్లారెడ్డిపేట: మండలంలో మొదటి రోజు వివిధ పథకాల కోసం నాలుగు గ్రామాల్లో 708 మంది దరఖాస్తులు చేసుకున్నారు. రాజన్నపేటలో 364, అక్కపల్లిలో 170,కిష్టునాయక్‌తండాలో 139,బుగ్గరాజేశ్వరతండాలో 35 మంది దరఖాస్తులు చేసుకున్నారు. జెడ్పీ డిప్యూటీ సీఈవో గీత, సిరిసిల్ల ఆర్డీవో ఆనంద్ కుమార్, ఎంపీడీవో చిరంజీవి, తహసీల్దార్ రామచంద్రం, జెడ్పీటీసీ లక్ష్మణ్‌రావు, ఎంపీపీ రేణుక, సెస్ డైరెక్టర్ కృష్ణహరి, సర్పంచ్‌లు శంకర్, మధుకర్, సునీత, రజిత, అధికారులు పాల్గొన్నారు.

అధిక సంఖ్యలో దరఖాస్తులు

మండలంలో ప్రజాపాలన గ్రామసభలకు దరఖాస్తుదారులు అధిక సంఖ్యలో రావడంపై బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య హర్షం వ్యక్తంచేశారు. అక్కపల్లి, రాజన్నపేట గ్రామాల్లో మహిళల నుంచి దరఖాస్తులు ఎక్కువ వచ్చాయన్నారు.

ఆరు గ్యారంటీలు అమలుచేస్తాం

తంగళ్లపల్లి: ఆరుగ్యారంటీలు అమలుచేస్తామని మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. ఇల్లంతకుంట మండలకేంద్రంలో ప్ర జాపాలన కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు.

అంకుషాపూర్, అంకిరెడ్డిపల్లె గ్రామాల్లో..

మండలంలోని అంకుషాపూర్, అంకిరెడ్డిపల్లె గ్రామాల్లో ప్రజాపాలన కార్యక్రమాన్ని జెడ్పీటీసీ పూర్మాని మంజుల రాంలింగారెడ్డి, ఎంపీపీ పడిగెల మానస రాజు, సెస్ చైర్మన్ చిక్కాల రామారావుతోకలిసి ప్రారంభించారు. అంకుషాపూర్ ప్రజాపాలనను అడిషనల్ కలెక్టర్ (స్థానిక సంస్థలు) గౌతమి, సిరిసిల్ల ఆర్డీవో ఆనంద్ కుమార్ సందర్శించి సూచనలు చేశారు. అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

చందుర్తి(వేములవాడ): ప్రజా పాలన కార్యక్రమంలో అర్జీదారులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చూడాలని అడిషనల్ కలెక్టర్ గౌతమి సూచించారు. మండలంలోని మూడపల్లి, నర్సింగపూర్, ఆశిరెడ్డిపల్లె, అనంతపల్లె గ్రామాల్లో ప్రజా పాలన గ్రామసభలు నిర్వహించగా ఆశిరెడ్డిపల్లె, అనంతపల్లె గ్రామాల్లోని గ్రామసభలను సందర్శించారు. గ్రామ సభలో అర్జీదారులతో మాట్లాడారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీవో రవీందర్, ఎంపీవో ప్రదీప్, వ్యవసాయాధికారి దుర్గారాజు, ఏపీఎం రజిత, వివిధ శాఖ అధికారులు , పంచాయతీ కార్యదర్శులు, గ్రామ సర్పంచ్‌లు తదితరులు పాల్గొన్నారు.

గంభీరావుపేట: గజసింగవరం, రాజేశ్వర్‌రావునగర్, సముద్రలింగాపూర్, మల్లుపల్లిలో అధికారులు గ్రామసభలు నిర్వహించారు. ఎంపీపీ వంగ కరుణ, జెడ్పీటీసీ కొమిరిశెట్టి విజయ, ప్రత్యేకాధికారి బుద్ధ నా యుడు, ఎంపీడీవో శ్రీనివాస్ సభలను పర్యవేక్షించారు. అధికారులు దరఖాస్తులను స్వీకరించారు. గజసింగవరంలో 352, సముద్రలింగాపూర్‌లో 478, మల్లుపల్లిలో 52, రాజేశ్వర్‌రావునగర్‌లో 228 దరఖాస్తులు వచ్చినట్లు ఎంపీడీవో పేర్కొన్నారు.

సద్వినియోగం చేసుకోవాలి

ముస్తాబాద్: ప్రజాపాలనను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ జనగామ శరత్‌రావు కోరారు. ఆవునూర్‌లో ప్రజాపాలన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆవునూర్‌లో 245 దరఖాస్తులు, తుర్కపల్లిలో 124 దరఖాస్తులు వచ్చాయి. బందనకల్, వెంకట్రావుపల్లెలో తహసీల్దార్ గణేశ్ ఆధ్వర్యంలో దరఖాస్తులు స్వీకరించారు. జెడ్పీటీసీ నర్సయ్య, సెస్ డైరెక్టర్ అంజిరెడ్డి, సర్పంచులు పాల్గొన్నారు.

గ్రామసభల పరిశీలన

సంక్షేమమే ధ్యేయంగా అరు గ్యారంటీలను అమలు చేసేందుకు సీఎం రేవంత్‌రెడ్డి ప్రజాపాలన నిర్వహిస్తున్నారని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు యెల్ల బాల్‌రెడ్డి అన్నారు. తుర్కపల్లి, ఆవునూర్ గ్రామాల్లో ప్రజాపాలన గ్రామసభలను పరిశీలించి, మాట్లాడారు. కాంగ్రెస్ నాయకులు తదితరులున్నారు.



ఎల్లారెడ్డిపేట: బుగ్గరాజేశ్వరతండాలో దరఖాస్తులు స్వీకరిస్తున్న ఆర్డీవో

రుద్రంగి: మండలంలోని బడితండా, అడ్డబోర్ తండా, చింతామణి తండా గ్రామాల్లో తహసీల్దార్ శ్రీలత, ఎంపీడీవో మాలోతు శంకర్, ఎస్సై రాజేశ్, ప్రజాపాలన కార్యక్రమం మండల ప్రత్యేక అధికారి మోహన్ రెడ్డి, వివిధ శాఖల అధికారులు ప్రజాపాలన కార్యక్రమం ప్రారంభించారు.

3,606 దరఖాస్తులు

కోనరావుపేట: బావుసాయిపేట, కొలనూర్, గొల్లపల్లి(కొలనూర్), గోవిందరావుపేట తండా గ్రామాల్లో నిర్వహించిన ప్రజాపాలన కార్యక్రమంలో మొత్తం 3,606 దరఖాస్తులు వచ్చాయి. ఇందులో గృహలక్ష్మి కోసం 941, రైతుభరోసా కోసం 617, గృహజ్యోతి పథకం కోసం 723, ఇందిరమ్మ ఇళ్ల కోసం 773, చేయూత కోసం 404, ఇతర దరఖాస్తులు 148 చొప్పున వచ్చాయి.

వీర్నపల్లి: అడవిపదిర, బంజేరు, భూక్యతండా, బావుసింగ్‌నాయక్‌తండాలో ప్రజా పాలన కార్యక్రమాన్ని ఎంపీపీ మాలోతు భూల ఆయాగ్రామాల ప్రజాప్రతినిధులతో కలిసి ప్రారంభించారు. తహసీల్దార్ ఉమారాణి, ఇన్‌చార్జి ఎంపీడీవో నరేశ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

అడవిపదిరలో జాలపల్లి మనోజ్ కుమార్ గ్రామంలోని పోడు భూముల సమస్యలు పరిష్కరించాలని వినతిపత్రం అందజేశారు. గ్రామంలోకి వెళ్లే దారిలో వంతెన నిర్మాణం చేపట్టాలన్నారు.



ముస్తాబాద్: మాట్లాడుతున్న ఎంపీపీ శరత్‌రావు



వీర్నపల్లి : దరఖాస్తులు స్వీకరిస్తున్న అధికారులు



చందుర్తి : అర్జీదారులతో మాట్లాడుతున్న అడిషనల్ కలెక్టర్

క్లుప్తంగా

పాఠశాలలో సమస్యలు పరిష్కరించాలి



ఆది శ్రీనివాస్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

కోనరావుపేట: మండలంలోని నిమ్మపల్లి ఉన్నత పాఠశాలలో సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌కు నాయకులు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పాఠశాలలో హిందీ టీచర్ లేకపోవడంతో పదో తరగతితో పాటు మిగతా తరగతుల విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. డెప్యూటేషన్‌పై హిందీ ఉపాధ్యాయుడిని నియమించాలని కాంగ్రెస్ మండలాధ్యక్షుడు షేక్ ఫిరోజ్ పాషా, నాయకులు పెంతల శ్రీనివాస్, అజీమ్ తదితరులు కోరారు.

దరఖాస్తుల ఆహ్వానం

వేములవాడరూరల్: గురుకుల పాఠశాలలో 5వ తరగతి ప్రవేశాల కోసం నిర్వహించనున్న ప్రవేశపరీక్షకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు వేములవాడ తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల ప్రిన్సిపాల్ ఎం.సూర్యప్రకాశ్ రావు గురువారం తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, జనరల్ కేటగిరీలకు చెందిన విద్యార్థులు 5వ తరగతిలో ప్రవేశం కోసం జనవరి 6వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ప్రవేశ పరీక్ష ఫిబ్రవరి 11న ఉంటుందన్నారు. మరిన్ని వివరాలకు 1800425 45678 హెల్ప్‌లైన్‌లో సంప్రదించాలన్నారు.

గంభీరావుపేట: మండలంలోని నర్మాల సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల విద్యాలయంలో వచ్చే విద్యా సంవత్సరానికిగాను ఐదో తరగతి ప్రవేశానికి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ నిర్మల తెలిపారు. ఆసక్తిగల విద్యార్థులు జనవరి 6లోపు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరంలో ఎంపీసీ, బైపీసీ, ఎంఈసీ, సీఈసీ గ్రూపుల్లో ప్రవేశం కోసం దరఖాస్తులు చేసుకోవాలని కోరారు. ఆన్‌లైన్ ద్వారా జనవరి 15లోపు దరఖాస్తులు చేసుకోవాలని తెలిపారు.

కళాజాత ప్రదర్శన



కళాజాత నిర్వహిస్తున్న కళాకారులు

తంగళ్లపల్లి: మండలంలోని బద్దెనపల్లిలో గురువారం సమాచార పౌర సంబంధాల శాఖ ఆధ్వర్యంలో తెలంగాణ సాంస్కృతిక సారథి బృందం సభ్యులు కళాజాత ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు పాటల రూపంలో వికసిత భారత్ సంకల్ప యాత్ర గురించి, ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆరు గ్యారంటీ సంక్షేమ పథకాల గురించి పాటల రూపంలో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సీడీపీవో అలేఖ్య, ఐసీడీఎస్ సూపర్వైజర్ సుస్మిత, కళాకారులు గడ్డం శ్రీనివాస్, అంతడ్పుల ఝాన్సీ, దేవయ్య, అనుముల శిరీష, ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తాం

ముస్తాబాద్(సిరిసిల్ల): సాధారణ నిధులతోపాటు స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ ద్వారా వచ్చిన నిధులు పక్కదారి పట్టాయని పోతుగల్ వార్డు సభ్యులు కావటి మహిపాల్, జంగరాజు, రాజమణి, మాచర్ల స్వర్ణ అన్నారు. మండలంలోని పోతుగల్‌లో జరిగిన గ్రామసభలో వారు మాట్లాడారు. 2014 నుంచి 2022 వరకు పోతుగల్ పంచాయతీలో నిధులు పక్కదారి పట్టాయని ఆరోపించారు. సమాచార హక్కు చట్టం ద్వారా తీసుకున్న వివరాల్లో రూ.19లక్షలకు అభ్యంతరాలున్నాయని ఆడిట్ అధికారులు చెప్పినట్లు పేర్కొన్నారు. ఇప్పటివరకు నిధులను రికవరీ చేయలేదో కార్యదర్శి చెప్పాలని డిమాండ్ చేశారు. దీనిపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామన్నారు. రామాలయం భూములను ఇతర అవసరాలకు కేటాయించడం సరికాదన్నారు. నిధుల ఖర్చులకు సంబంధించిన వివరాలను త్వరలోనే అందజేస్తామని కార్యదర్శి మహ్మద్ ఆఫర్ అన్నారు. సర్పంచ్ గౌతంరావు, ఎంపీటీసీ బాలకిషన్, ఉపసర్పంచ్ మంజుల, వార్డు సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ప్రొటోకాల్‌పై రగడ

వేములవాడరూరల్: వేములవాడలోని 3వ వార్డులో జరిగిన ప్రజాపాలన కార్యక్రమంలో బీఆర్‌ఎస్, కాంగ్రెస్ నాయకుల మధ్య ప్రోటోకాల్ రగడ నెలకొంది. వేదికపైకి కాంగ్రెస్ నాయకులను పిలవడంతో ఇది ప్రభుత్వ కార్యక్రమమని కాంగ్రెస్ కార్యక్రమం కాదంటూ మున్సిపల్ చైర్‌పర్సన్ మాధవి, వార్డు కౌన్సిలర్ నిమ్మశెట్టి విజయ్ అభ్యంతరం తెలిపారు. ఈ సమావేశాన్ని బైకాట్ చేస్తున్నామంటూ వేదికపైనుంచి వెళ్లారు. వెంటనే ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ కలుగజేసుకుని వేదికపై ఉన్న కాంగ్రెస్ నాయకులను సర్దిచెప్పారు. వారిని వేదిక నుంచి దింపడంతో సమస్య సద్దుమణిగింది. ఆర్డీవో మధుసూదన్, మున్సిపల్ చైర్‌పర్సన్ రామతీర్థపు మాధవి, ఇన్‌చార్జి మున్సిపల్ కమిషనర్, తహసీల్దార్ మహేశ్, కౌన్సిలర్ నిమ్మశెట్టి విజయ్, కొడుముంజ సర్పంచ్ కదిరె రాజు, కాంగ్రెస్, బీఆర్‌ఎస్ నాయకులు, వార్డు ప్రజలు పాల్గొన్నారు.

జీపీఎఫ్ సమస్యలు పరిష్కరించాలి

• టీపీటీఎఫ్ అధ్యక్షుడు భూపాల్‌రెడ్డి



జెడ్పీ సీఈవో గౌతంరెడ్డికి వినతిపత్రం ఇస్తున్న టీపీటీఎఫ్ నాయకులు

సిరిసిల్లటౌన్: జీపీఎఫ్ సమస్యలు సత్వరమే పరిష్కరించాలని టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు దోర్నాల భూపాల్‌రెడ్డి కోరారు. సిరిసిల్ల జెడ్పీ సీఈవోకు గురువారం వినతిపత్రం అందించి మాట్లాడారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా నుంచి రాజన్న సిరిసిల్ల జిల్లా జెడ్పీకి జీపీఎఫ్ ఖాతాల వివరాలు పంపించి నెలలు గడుస్తున్నా ఉపాధ్యాయుల జీపీఎఫ్ వివరాలు అప్‌డేట్ కాలేదన్నారు. కుటుంబ అవసరాల కోసం చేసుకున్న లోన్లు, పార్ట్‌ఫైనల్ చెల్లింపులు కొత్త జిల్లా నుంచి చెల్లింపులు కాలేదని పేర్కొన్నారు. ఇతర జిల్లాల్లో అకౌంట్ వివరాలు పూర్తిగా ఆన్‌లైన్ చేశారని, ఆర్థిక చెల్లింపులు జరుగుతున్నాయన్నారు. టీపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి దుమాల రమానాథ్‌రెడ్డి, ఉపాధ్యక్షులు మల్లారపు పురుషోత్తం, జగిత్యాల శ్రీనివాస్, సతీశ్, బాబు, రవి, రమేశ్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు ఇవ్వాలి

సిరిసిల్లటౌన్: డబుల్‌బెడ్‌రూమ్ ఇళ్లను వెంటనే అర్హులకు అందించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మూశం రమేశ్ కోరారు. సిరిసిల్ల శివారులోని శాంతినగర్‌లో నిర్మించిన డబుల్‌బెడ్‌రూమ్ ఇళ్లను జాబితాలో పేర్లు వచ్చి కేటాయించని నిరుపేదలకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వం పదేళ్లుగా డబుల్‌బెడ్‌రూమ్ ఇళ్లను ఇస్తామని కాలయాపన చేసిందన్నారు. కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం నిరుపేదల సొంతింటి కలను నెరవేర్చాలని కోరారు. కోడం రమణ, డబుల్‌బెడ్రూం ఇండ్ల లబ్ధిదారులు పాల్గొన్నారు.

విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎమ్మెల్యే సత్యం

• చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

బోయినపల్లి: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం పేర్కొన్నారు. గురువారం మండలకేంద్రంలోని హైస్కూల్ మైదానంలో చెన్నాడి మార్తండరావు స్మారక క్రీడాపోటీలు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందన్నారు. పది విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలని ఎంఈఓ శ్రీనివాస దీక్షిత్‌కు సూచించారు. కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ చెన్నాడి రాజ్యలక్ష్మి, ఎంపీపీ పర్లపల్లి వేణుగోపాల్, సర్పంచులు గుంటి లతశ్రీ, జోగినిపల్లి ప్రేమ్‌సాగర్‌రావు, ఎంపీటీసీ సంబ బుచ్చమ్మ, కాంగ్రెస్ బీసీసెల్ జిల్లా అధ్యక్షుడు కూస రవీందర్, పీఈటీ సీహెచ్.సంపత్‌రావు తదితరులున్నారు.

ఎమ్మెల్యేను కలిసిన రేషన్ డీలర్లు

మండల రేషన్ డీలర్లు చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంను గంగాధరలోని ఆయన ప్రజా కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనను ఘనంగా సన్మానించారు. మండల రేషన్ డీలర్ల సంఘం అధ్యక్షుడు ఎర్ర నర్సయ్య, డబ్బు వెంకటరెడ్డి, కొప్పుల రాజు, పొత్తూరి సురేశ్ బాబు తదితర మండల డీలర్లు ఉన్నారు.

దళారులను నమ్మొద్దు

రాజకీయాలకు అతీతంగా అందరికీ పథకాలు అందుతాయని, దళారీలను నమ్మొద్దని అని చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. బోయినపల్లి, బూర్గుపల్లి, కోరెం గ్రామాల్లో ప్రజాపాలన గ్రామసభలు ప్రారంభించి మాట్లాడారు. నియోజకవర్గంలో అవినీతి రహిత పాలన అందించేందుకు అధికారులు, ప్రజలు సహకరించాలని కోరారు. రైతు భరోసా మరో పది రోజుల్లో అందుతుందన్నారు. కోరెం, బోయినపల్లి గ్రామాల్లో ఆర్టీసీ బస్సులు నడపాలని మహిళలు కోరారు. బోయినపల్లిలో కరీంనగర్ వేములవాడ బస్సు ప్రారంభించారు. ఆయా గ్రామాల్లో కౌంటర్ల వద్ద దరఖాస్తులు పరిశీలించారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ గౌతంరెడ్డి, ఎంపీపీ పర్లపల్లి వేణుగోపాల్, సర్పంచులు సెస్‌డైరెక్టర్ కొట్టెపెల్లి సుధాకర్, తహసీల్దార్ డీ.పుష్పలత, ఎంపీడీవో నల్లా రాజేందర్‌రెడ్డి, అధికారులు ఉన్నారు.

పేదలకు పథకాలు అందించాలి

• మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ

తంగళ్లపల్లి: నిరుపేదలకు ప్రభుత్వ పథకాలు అందించాలని మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారయణ అన్నారు. గురువారం ఇల్లంతకుంట మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ వుట్కూరి వెంకట రమణ రెడ్డి అధ్యక్షతన జరిగింది. ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ హాజరయ్యారు. ప్రజాప్రతినిధులు పలు సమస్యలను అధికారులపై దృష్టికి తీసుకెళ్లారు. సర్పంచుల ఫోరం అధ్యక్షుడు చల్ల నారాయణ మాట్లాడుతూ చేసిన పనులకు బిల్లులు ఇవ్వకుంటే గ్రామపంచాయతీలకు తాళాలు వేస్తామన్నారు. ఇల్లంతకుంట సర్పంచ్ భాగ్యలక్ష్మి మాట్లాడుతూ పశువైద్య సిబ్బంది లేకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. నల్లా ద్వారా ఫిల్టర్ వాటర్ రావడం లేదని పెద్దలింగాపూర్ ఎంపీటీసీ తెలిపారు. గ్రామాలకు మిషన్ భగీరథ నీటిపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. గత ప్రభుత్వం పదేళ్లుగా రేషన్ కార్డులు ఇవ్వలేదని, రేషన్ ద్వారా బియ్యం మాత్రమే ఇస్తున్నారని దానికి తోడు అంత్యోదయ కార్డులను తొలగించారని ఎమ్మెల్యే అన్నారు. సంక్రాంతికి ముందే బిల్లులు చెల్లించాలన్నారు. పెండిగ్ బిల్లుల చెల్లింపు కోసం కృషిచేస్తానన్నారు. ఇల్లంతకుంట, పొత్తూరు, కట్కూర్, ఓబులాపూర్, అనంతారం, సిరికొండ, దాచారం, గాలిపెల్లి, నర్సక్కపేట, జవారిపేట గ్రామాల్లో రోడ్లు వేయాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో ప్రజలకు మేలు జరుగుతుందన్నారు. అనంతరం ఎమ్మెల్యే కవ్వంపల్లిని సర్పంచులు, ఎంపీటీసీలు సన్మానించారు. వైస్ ఎంపీపీ శ్రీనాథరావు, పీఆర్ డీఈ సుదర్శన్ రెడ్డి, సెస్ డైరెక్టర్ రవీందర్ రెడ్డి, తహసీల్దార్ ఇజాజ్ అహ్మద్, ఇన్‌చార్జి ఎంపీడీవో మీర్జా, ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

31న ప్రత్యేక తనిఖీలు

సిరిసిల్లక్రైం: డిసెంబర్ 31న పట్టణంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రతి ఒక్కరూ సహకరించాలని అందించాలని సీఐ ఉపేందర్ కోరారు. గురువారం పట్టణ పోలీస్‌స్టేషన్‌లో పట్టణ కౌన్సిలర్లతో సమావేశం నిర్వహించారు. డిసెంబర్ 31న సాయంత్రం నుంచి పట్టణంలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించి డ్రంకెన్ డ్రైవ్ నిర్వహిస్తామన్నారు. తల్లిదండ్రులు మైనర్లకు ద్విచక్రవాహనాలు ఇవ్వొద్దన్నారు. అధిక వేగంతో వాహనాలు నడపడం, త్రిబుల్ రైడింగ్ చేస్తూ ఇతరులను ఇబ్బంది పెట్టేవారి వాహనాలు సీజ్ చేస్తామన్నారు. డీజేలకు అనుమతి లేదని పేర్కొన్నారు. బహిరంగ ప్రదేశంలో మద్యం తాగవద్దని సూచించారు. నూతన సంవత్సర వేడుకలను ప్రతిఒక్కరూ తమ కుటుంబ సభ్యులతో ఆనందోత్సవాల మధ్య జరుపుకోవాలని సీఐ సూచించారు.

కాంగ్రెస్ ఆవిర్భావ వేడుకలు

ఎల్లారెడ్డిపేట/ముస్తాబాద్/ గంభీరావుపేట/ వీర్నపల్లి/ తంగళ్లపల్లి:

సిరిసిల్ల, వేములవాడ నియోజకవర్గంలో కాంగ్రెస్ ఆవిర్భావ వేడుకలను గురువారం నాయకులు ఘనంగా నిర్వహించారు. అనంతరం పార్టీ జెండాను ఆవిష్కరించారు. నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



గంభీరావుపేట: పార్టీ జెండాను ఆవిష్కరిస్తున్న నాయకులు



తంగళ్లపల్లిలో ..

సరదాగా.. సందడిగా

• మానేరులో బోటు షికారు..
• వరదవెల్లి దత్తాత్రేయ స్వామి ఆలయంలో పూజలు
• సరదాతోపాటు దర్శనంతో భక్తుల ఆనందం




బోటులో వెళ్తున్న భక్తులు

బోయినపల్లి: విమానంలో ఎక్కాలని.. నీటిలో బోటులో ప్రయాణించాలని ప్రతిఒక్కరికీ ఆసక్తిగా ఉంటుంది. దత్త జయంతి ఉత్సవాల సందర్భంగా బోటు ఎక్కాలనే ఈ ప్రాంత వాసుల సరదాను టూరిజం శాఖ నెరవేర్చింది. మిడ్‌మానేరు ప్రాజెక్ట్ బ్యాక్ వాటర్‌లో వరదవెల్లి గుట్టపై గురు దత్తాత్రేయ స్వామి ఆలయం ఉంది. ఏటా దత్త జయంతి ఉత్సవాలు వైభవంగా జరుగుతాయి. ఎటుచూసినా కనుచూపు మేర కనిపించే నీరు.. చుట్టూ నీటిమధ్య గుట్టపై వెలసిన దత్త ఆలయంలో బోటులో వెళ్లి పూజలు చేయడం ప్రశాంతతో పాటు ఆహ్లాదాన్ని కలిగించిందని పలువురు భక్తులు తెలుపుతున్నారు. ఈనెల 25వ తేదీ నుంచి 27 వరకు ఉత్సవాలు కన్నుల పండువగా జరిగాయి. టూరిజం శాఖ రెండు బోట్లు సమకూర్చింది. నీటిలో బోటు ప్రయాణంపై పలువురు ఆనందపడుతున్నారు.

కిలోమీటర్ వరకు ప్రయాణం


మధ్యమానేరు ప్రాజెక్టులో సుమారు 17 కిలోమీటర్ల మేర బ్యాక్‌వాటర్ ఉంది. ఇందులో నీటిలో అందంగా కనిపించే వరదవెల్లి గుట్టను చూస్తే మనస్సుకు ప్రశాంతంగా ఉంటుందని భక్తులు చెబుతున్నారు. వరదవెల్లి పాత గ్రామం నుంచి సుమారు కిలోమీటర్ మేర నీటిలో బోటులో ప్రయాణం చేస్తే దత్తాత్రేయస్వామి ఆలయం వస్తుంది. బోటు దిగాక వందమెట్లు ఎక్కితే స్వామివారి ఆలయానికి చేరుకుంటారు. ఆలయం చుట్టూ పచ్చని చెట్లు, స్వచ్ఛమైన గాలి భక్తులకు ఆహ్లాదం కలిగిస్తుందని భక్తులు తెలుపుతున్నారు. మూడ్రోజుల పాటు జరిగిన ఉత్సవాల్లో రెండు బోట్లలో భక్తులను తీసుకెళ్లారు. ఒక బోటు ట్రిప్‌లో సుమారు పదిమంది చొప్పున ప్రయాణించేవారు. ఈ మేరకు పెద్దమొత్తంలో బోటులో వెళ్లి దైవదర్శనం చేసుకున్నారు. బోటులో వెళ్లి దర్శనం చేసుకోవడంతో అటు బోటు సరదా తీరడంతో పాటు దైవదర్శనం జరగడంపై భక్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

బోటు సరదా తీరింది




వరదవెల్లి గుట్టపై ఉన్న దత్తాత్రేయస్వామి ఆలయానికి నీటిలో బోటులో వెళ్లడం ఎంతో సంతోషాన్ని కలిగించింది. కుటుంబంతో పాటు స్నేహితులతో ఆలయానికి బోటులో వెళ్లాం. బోటులో ప్రయాణం ఆహ్లాదాన్నిచ్చింది. బోటులో తిరగాలనే సరదా తీరింది. – సంధ్య, వరదవెల్లి

చిన్నారులకు సంతోషం



దత్తజయంతి ఉత్సవాలతో బోటులో షికారుచేసే అవకాశం కలగడం ఈ ప్రాంత వా సులకు అదృష్టం. టూరిజం శాఖవారు నీటిలో ఆలయానికి వెళ్లేందుకు బోటు సమకూర్చారు. దీంతో పలువురు చిన్న పిల్లలతో బో టులో ప్రయాణించడం పట్ల సంతృప్తి చెందారు. – ఆరెపెల్లి రాజు, వరదవెల్లి

వేలాది మంది భక్తులు



దత్త జయంతి ఉత్సవాలు ఘనంగా జరిగాయి. మూడు రోజులు పాటు జరిగిన వేడుకలకు వేలాదిమంది భక్తులు బోటులో వెళ్లి దత్తజయంతి పూజలు నిర్వహించారు. ఎంతో మంది ప్రముఖులు స్వామివారి దర్శనం చేసుకున్నారు. – ఆడెపు రాజు, వరదవెల్లి

ఆర్థికసాయం అందజేత



తంగళ్లపల్లి: ఇల్లంతకుంట మండలకేంద్రానికి చెందిన రొడ్డ శ్రీకాంత్ అనారోగ్యంతో బాధపడుతుండగా గురువారం బాధితుడిని సిద్దిపేటకు చెందిన ప్రముఖ ఆర్థోసర్జన్ డాక్టర్ శ్రీనివాస్ పరామర్శించారు. తక్షణసాయంగా రూ.10 వేలు అందజేశారు. మెరుగైన చికిత్స అందించడంతోపాటు భవిష్యత్తులో అండగా ఉంటానన్నారు. తన తండ్రి సముద్రాల భూమయ్య జ్ఞాపకార్థం 'సముద్రాల చారిటబుల్ ట్రస్టు' నిర్వహిస్తూ సేవలందిస్తున్నట్లు పేర్కొన్నారు.

పరామర్శ

మల్లాపూర్ గ్రామానికి చెందిన బాస రాజయ్య ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. ఎంపీటీసీ కోడి అంతయ్య బాధిత కుటుంబాన్ని పరామర్శించి రూ.5 వేలు ఆర్థికసాయంగా అందించారు.